క్లుప్తంగా

అక్టోబర్‌లో 24 గంటల హ్యాకథాన్



భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబర్ 25, 26 తేదీల్లో హేకోవర్ ఫ్లో 2024 పేరిట 24 గంటల హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీ కృష్ణంరాజు తెలిపారు. సోమవారం కళాశాలలో హ్యాకథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కోడింగ్ క్లబ్ కన్వీనర్ కె డేవిడ్‌రాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న హ్యాకథాన్‌లో వ్యవసాయం, ఆరోగ్య భద్రత, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ అనే అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. హ్యాకథాన్‌లో విజేతలకు రూ.30 వేలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ వి చంద్రశేఖర్, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ బీహెచ్ వీఎస్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



రూ.2 లక్షల విరాళాన్ని అందిస్తున్న హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్

భీమవరం: వరద బాధితులకు భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ రూ 2 లక్షల విరాళాన్ని అందించింది. సోమవారం ఈ విరాళాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు స్పందించడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సరిపిడకల రామారావు, కంతేటీ వెంకటరాజు, కుక్కల బాల, జానపాటి మధుసూదన్‌రావు, ఏ రమేష్, ఎం.రాంప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుకు 25 తుది గడువు

పాలకోడేరు: రైతులు ఈ-పంట నమోదు చేసుకొనుటకు ప్రభుత్వం ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-పంట ముఖ్య ఉద్దేశ్యం అతివృష్టి, అనావృష్టి సంభవించినా, నకిలీ విత్తనాలు, పంటకు మద్దతు ధర రాకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పెట్టుబడి చేతికందకపోవడం, వంటి పరిస్థితుల్లో రైతుకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పంటను విక్రయించాలంటే తప్పనిసరిగా రైతులు పంట సాగు వివరాలను యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (యూడీపీ) లో నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఆధార్ కార్డ్, పట్టాదార్ పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, పంట వివరాలు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలన

ఆకివీడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో 75 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, ఒక దరఖాస్తును తిరస్కరించగా 74 మంది ఓటర్లున్నారన్నారు. గత ఎన్నికల్లో 118 మంది ఓటర్లున్నారని తెలిపారు. ఓట్ల నమోదుకు నవంబర్ 6 తుది గడువన్నారు. ఎన్నికల తేదీని ప్రకటించాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, కూటమి నాయకులు బొల్లా వెంకట్రావు, అల్లాడి నర్సింహరావు పాల్గొన్నారు.

తోటి మానవులను ప్రేమించడమే ప్రవక్త సందేశం

భీమవరం: తోటి మానవులను, సమాజాన్ని ప్రేమించాలనేదే మహమ్మద్ ప్రవక్త సందేశమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. జమాత్-ఎ-ఇస్లామీ హింద్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో అంకాల ఆర్ట్స్ అకాడమీలో ప్రవక్త మహమ్మద్ జన్మించిన నెలను పురస్కరించుకొని నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు వివిధ దశల్లో వివిధ రంగాల్లో ఎలా నడుచుకోవాలో ఏది హితమో ఆచరణాత్మకంగా మహమ్మద్ ప్రవక్త వివరించారని అన్నారు. ఏపీ జమాత్-ఎ-ఇస్లామి హింద్ అధ్యక్షుడు జనాబ్ మహమ్మద్ రఫీఖ్ సాహెబ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్‌కు అల్లా ఖురాన్‌ను అవతరించడాన్ని గుర్తించేందుకు ప్రతి ఏటా ఈద్-ఉల్-ఫితర్ జరుపుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించారు. జమాత్-ఎ-ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు జనాబ్ సయ్యద్ ఫర్హాన్ సాహెబ్, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

కోలాహలంగా గణపతి నిమజ్జనాలు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ విద్యా గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా శ్రీఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య, పురజనుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని సోమవారం ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గునుపూడి ఆడపడుచు మహిళా సంఘం సభ్యులు ఊరేగింపులో సంప్రదాయ బద్ధంగా కోలాట ప్రదర్శన చేశారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వేలూరి హనుమ కిరణ్, మారెళ్ళ అఖిలేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

భీమవరం: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని 18, 19 వార్డు పసుపులేటి వారి వీధిలో యువ చైతన్య ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చవితి ఉత్సవాల్లో అన్నసమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే రబ్బాని, హమ్మఖ లాల్‌జైన్, శేషాద్రి హరిబాబు, కాళీకొండ, ఆకుల గణేష్, సుంకర నరేష్, ఎండీ ఇర్ఫాన్, ఆకుల బాలాజీ ,శేషాద్రి కృష్ణ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



వీరవాసరం: రాయకుదురులో స్వామివారి ఊరేగింపు

వీరవాసరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో స్వామివార్ల విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ తాళాలు, బాణసంచా కాల్పుల మధ్య స్వామి వార్ల ఉత్సవ విగ్రహాల విగ్రహాల ఊరేగింపు వేడుకగా చేపట్టారు. గణేష్ మహారాజ్ కి జై అంటూ ఆధ్యాత్మిక భావనలతో ముందుకు సాగారు. అనంతరం కొన్ని గ్రామాల్లో అన్న సమారాధన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు.



కాళ్ల: దొడ్డనపూడిలో గణనాథుణ్ణి క్రేన్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

కాళ్ల: గణపతి నవరాత్రులు పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో స్వామి వారి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించగా కొన్ని గ్రామాల్లో స్వామివారి అఖండ అన్న సమారాధనలు నిర్వహించారు. ప్రధానంగా సోమవారం దొడ్డనపూడిలో వేంచేసియున్న రాజరాజేశ్వరి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 12 అడుగుల గణనాథుడి నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గణేష్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు గుండా సాయి, చెన్నంశెట్టి దేవి ప్రసాద్, తదితులు పాల్గొన్నారు.

బైబై గణనాథ

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం పలు చోట్ల మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద, వర సిద్ధి వినాయక ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ మండపాల్లోని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఊరేగింపు సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు తెలిపారు.



భీమవరం (ప్రకాశం చౌక్): గణపతి నిమజ్జన ఊరేగింపు



భీమవరం: పసుపులేటి వారివీధిలో నిర్వహిస్తున్న అన్నసమారాధన



ఆకివీడు: దుంపగడప రోడ్డులో వినాయక ఊరేగింపు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భీమవరం: భీమవరం 33/11 కేవీ జీఐఎస్ విద్యుత్ కేంద్ర పరిధిలో గల 11 కేవీ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీనివాస సెంటర్, జంక్షన్ రోడ్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, రైతు బజార్ ప్రాంతం, బండ్రోతుల వారి వీధి, కామాక్షి మాత ఆలయం ప్రాంతం, రాంబాడవ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నసమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ఉపాలయమైన శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి గణపతి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని కొయ్యే సుందరరాజు ప్రారంభించారు.

చెరువు గట్ల ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ఆకివీడు: ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని దొరగారి చెరువు, ఆనాల చెరువు గట్ల ఆక్రమణలను సోమవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించిన భవనాలను, షాపులను పరిశీలించారు. ఆక్రమణలను సర్వే చేయించి, తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మోటుపల్లి ప్రసాద్, గొంట్లా గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కాళ్ల: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 5 మంది జూదరులను అరెస్టు చేశామని కాళ్ల ఎస్సై సోమవారం తెలిపారు. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం ఏలూరుపాడు సంతపేట ఏరియాలో కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురి అదుపులోకి తీసుకొని, వారి వద్ద రూ.1,950 నగదు, కోడిపుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చిట్టీ నిర్వాహకురాలిపై కేసు నమోదు



చిట్టీలు కట్టి మోసపోయామంటున్న బాధితులు

పాలకోడేరు: మా వద్ద నుంచి చిట్టీలు కట్టించుకొని, మా సొమ్ము ఇవ్వకుండా ఎగవేసిందంటూ కొంత మంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేండ్ర గ్రామానికి చెందిన చీర వెంకట రమణ అనే మహిళపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన ఇది. ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. వేండ్ర గ్రామానికి చెందిన వెంకట రమణ చుట్టు పక్కల గ్రామాల ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, గత కొన్ని ఏళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. ఇటీవల కాలంలో పాట సొమ్ము సరిపెట్టకుండా సాకులు చెబుతున్నారని వేండ్ర గ్రామానికి చెందిన మందపాటి రామరాజు, మరో వందమంది కలిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.హరిబాబు తెలిపారు.

రేకుల షెడ్డు దగ్ధం

భీమవరం అర్బన్: దిరుసుమర్రు గ్రామంలోని కొత్తపేటలో వృద్ధుడు కొప్పు వెంకట్రావు రేకుల షెడ్డు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వెంకట్రావు సాయంకాలం సమయంలో బయటకు వెళ్లగా ఇంటికి వచ్చేసరికి రేకుల షెడ్డు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడుతున్నాయి. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే మంచం, ఇతర ఫర్నీచర్లు కాలి బూడిదయ్యాయి. చెరువు లీజు రూ.లక్ష దాచుకున్నానని, అవి కూడా కాలిపోయాయని వృద్ధుడు చెబుతున్నాడు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరుగవచ్చని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ముంపు నీటిలోనే ప్రభుత్వ ఆసుపత్రి



నీట మునిగిన ప్రభుత్వ ఆసుపత్రి



ఆసుపత్రి ఆవరణలో ముంపు నీటిలో ఉన్న 104 వాహనాలు



వరి చేలల్లో తూడు, తామర్లు పేరుకుపోతున్న దృశ్యం

ఆకివీడు: ముంపు నీటిలోనే ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం మునుగుతోంది. గత వారం రోజులుగా ముంపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఆసుపత్రి చుట్టూ ముంపు నీరు తిష్ట వేసింది. ఆసుపత్రి ప్రాంగణం నుంచి వెళ్లే పంట బోదె పొంగి ప్రవహించడంతో ముంపునీరు భారీగా చొచ్చుకొచ్చింది. ఆసుపత్రి ఆవరణలో సుమారు మూడడుగుల నీరు నిలబడి ఉండగా గత రెండు రోజుల నుంచి నీరు ఇంకిపోవడంతో ప్రస్తుతం అడుగున్నర లోతు నీరు నిలబడి ఉంది. ఆసుపత్రి ప్రాంగణంలోని పంట కాలువకు రెండు వైపులా మట్టితో కాలువను మూసి వేశారు. చినకాపవరం ముంపు నీరు ఎదురు ప్రవహిస్తూ ఆసుపత్రిలోకి రావడంతో చంద్రబాబు నగర్ వద్ద మట్టి బస్తాలు వేసి పూడ్చి వేశారు. ఆసుపత్రి ఆవరణలోని మురుగు నీరు, ముంపు నీరు రెండూ కలిసిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ముంపు నీటిని బయటకు తోడేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. గ్రామాల్లోనూ, పట్టణంలో వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయని, ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటే ఇక్కడ కూడా దోమల బాధతో వ్యాధులను తీవ్రతరం చేసుకునే పరిస్థితి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో ముంపు నీటిని బయటకు పంపించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముంపు పోయి వ్యర్థాలను మిగిల్చింది

ఆకివీడు: బరువైన గుండెతో బాధపడుతూ, కన్నీళ్లతోనే వరద ముంపు నీటిని బయటకు సాగనంపే పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. వారం రోజుల పాటు గజ గజలాడించిన గంగాదేవి జల విళయతాండవంతో ఉక్కిరి బిక్కిరి చేసి, మెల్ల మెల్లగా సాగుతూ సముద్రుడి చెంతకు చేరుతోంది. వరద నీటి మట్టం తగ్గు ముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటుంటే, అన్నదాతలు కన్నీళ్ళతో కలవరిస్తున్నారు. పంట మునిగి తేలుతుందనే ఆశల్లో ఉన్నారు. మరి కొన్ని గ్రామాల్లో ముంపునీటిలో వరి పంట కుళ్లిపోయిందని రోధిస్తున్నారు. పుండు మీద కారం జల్లినట్లుగా ముంపునీరు వెళ్లిపోయి చేలల్లోకి అజోల్లా జాతి నీటి మొక్కలు, పసర మొక్కలు, తూడు, తామర, గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోతున్నాయి. పైనుంచి వచ్చిన వండ్రు మట్టి మేటలతో పాటు ఇటువంటి వ్యర్థాలను తొలగించేందుకు భారీ వ్యయమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సాగుకు వరి చేలను తయారు చేయాలంటే ఎకరాకు సుమారు రూ.5 వేల నుంచి 8 వేల వరకూ ఖర్చవుతుందంటున్నారు. ఉపాధి హామీ పనుల్లో వరి పొలాలను శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారంగా రూ.10 వేలు ఇవ్వడం వలన వరి పొలాలను శుభ్రం చేయించడానికే సరిపోతాయంటున్నారు. రబీ సాగుకు పెట్టుబడుల కోసం మళ్లీ అప్పులోళ్ల దగ్గరకు వెళ్లి పుస్తెలు తాకట్టు పెట్టాల్సిందేనా అని వాపోతున్నారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ. 25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, పంటల బీమా వర్తింపజేయాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు.

కలెక్టర్ చెప్పినా.. పట్టించుకోవడం లేదు

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు గట్టుపై శ్రీ రాజ రాజేశ్వరి ఆలయ గోపుర నిర్మాణం గురించి కలెక్టర్ చదలవాడ నాగరాణి విచారణకు ఆదేశించినా దిగువ స్థాయి ఉద్యోగులు పట్టించుకోవడం లేదని బాధితులు కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మణిరత్నమాల దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ ఇంటికి ఎదురుగా రక్షిత మంచి నీటి చెరువు గట్టుపై అనుమతులు లేకుండా నిర్మిస్తున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ గోపుర నిర్మాణంపై రెండు వారాల కలెక్టర్ నాగరాణిని కలిసి సమస్యను వివరించామన్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ వివాదస్పద ఆలయ నిర్మాణంపై హైకోర్టులో కేసు విచారణలో ఉన్నా ఆలయంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



అధికారులకు చేసిన ఫిర్యాదులను చూపుతున్న సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు

కులమతాలకు అతీతంగా లడ్డూ వేలం

ఉండి: కులమతాలకు అంతీతంగా అందరం ఐకమత్యంగా, సంతోషంగా పండుగలు నిర్వహించుకోవడంలో చాలా సంతోషంగా ఉంటుందని ఉండి గ్రామానికి చెందిన ముస్లిం సోదరి షేక్ నసీమా అన్నారు. ఆదివారం రాత్రి ఉండిలోని పడవల రేవు, సీతారామపేట వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వినాయ నిమజ్జన కార్యక్రమాల్లో విశిష్టత సంతరించుకుంది. దీనికి కారణం రెండు ప్రాంతాలోహెల్న మంటపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో పాల్గొన్న నసీమా వాటిని సుమారుగా రూ.35 వేలకు పాడుకుంది. ఉండి పడవల రేవులో 51 కేజీల లడ్డూను రూ.22,500, సీతారామపేటలో లడ్డూను రూ.12,500 పాడుకుంది. దీంతో నిర్వహకులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. ముస్లిం మహిళ భక్తి శ్రద్ధలతో వినాయకుడి లడ్డూ వేలం పోటీపోటీగా పాడి ఆమె చివరకు వాటిని దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు వేలంలో లడ్డూలు లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను ముస్లిం కుటుంబంలో పుట్టినప్పటికీ తనకు హిందూ సాంప్రదాయాలంటే ఎంతో గౌరవమన్నారు. కుల, మతాలకు అతీతంగానే తాను ఎప్పుడూ ఉంటానని తెలిపారు. తాను ప్రతీ సోమవారం తనకు ఇష్టమైన శివాలయానికి వెళ్లి శివుడిని దర్శించుకుంటానని తెలిపారు. తాను వేలంలో దక్కించుకున్న లడ్డూలను ప్రజలకు ప్రసాదంగా పంచుతానని ఆమె తెలిపారు.



ఉండిలో వినాయకుడి లడ్డూలు వేలంలో దక్కించుకున్న ముస్లిం మహిళ

ఎండకు ఎండి.. వానకు తడిసి

కలెక్టరేట్ వద్ద వాహనాలకు రక్షణ కరువు

భీమవరం: భీమవరం పట్టణం జిల్లాకేంద్రంగా ఏర్పడి రెండేళ్ల గడిచిపోయినా వసతులలేమి వెంటాడుతూనే ఉంది. విశాలమైన భవనంలో కలెక్టరేట్ ఏర్పాటుచేసినా కనీసం వాహనాలకు షెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. కలెక్టరేట్‌లోని విధులకు హాజరయ్యే ఉద్యోగులు, సిబ్బందితోపాటు, ప్రతి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చేవారి ప్రజలు వాహనాలు కూడా ఎదురుగా గల ఖాళీస్థలంలో పార్కింగ్ చేస్తుంటారు. అయితే వాహనాల పార్కింగ్‌కు షెడ్‌వంటిది ఏర్పాటుచేయకపోవడంతో మోటారుసైకిళ్లు, కారులు ఎండకు ఎండి వానకు తడవాల్సిందే. ఇటీవల కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు వర్షాకాలంలో భారీవర్షాలు కురవడంతో తమ వాహనాలు పాడైపోతున్నాయని ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ ఎదురుగా గల చెట్లుకింద పార్కింగ్ చేద్దామంటే వర్షాకాలంలో పిడుగులు చెట్లపైపడి వాహనాలు దెబ్బతింటాయనే భయమేస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



భీమవరంలో కలెక్టరేట్ వద్ద షెడ్డు లేక ఎండకు ఎండుతున్న వాహనాలు

తెల్ల మందారానికి గులాబీ తోడు

ఆకివీడు: తెల్ల మందారం చెట్టుకు గులాబీ రంగు పువ్వు పూసింది. ప్రతీ రోజూ తెల్ల మందారాలే పూస్తుండగా సోమవారం తెల్లమందారంతోపాటు గులాబీ పువ్వు పూయడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. స్థానిక జవహర్ పేటలోని వెంకట రమణ పెరట్లో తెల్లమందారం చెట్టుకు గులాబీ రంగు పువ్వు పూసింది.



తెల్ల మందారం చెట్టుకు పూసిన గులాబీ పువ్వు

జువ్వలపాలెంలో ఉద్రిక్తతకు దారితీసిన ఘర్షణ



రహదారిపై బైఠాయించిన యువకులు

కాళ్ల: జువ్వలపాలెంలో సోమవారం రాత్రి గణేష్ నిమజ్జనం సందర్భంగా తలెత్తిన వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలోని ప్రైవేట్ హోటల్లో పని చేస్తున్న కాళ్లకూరు గ్రామంలోని ఒక సామాజిక వర్గానికి చెందిన ఈదా యాకోబు అనే వ్యక్తిపై గణేష్ నిమజ్జనం సందర్భంగా మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి దాడి చేయడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సంఘటనలో ఒక సామాజిక వర్గానికి చెందిన యువకులు భారీ ఎత్తున చేరుకొని, రహదారిపై బైఠాయించి, యువకుడిపై దాడి చేసిన వ్యక్తి క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న భీమవరం డివిజన్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరిపారు. అయితే దాడి చేసిన వ్యక్తి క్షమాపణ చెప్పాలంటూ యువకులు రోడ్డుపై బైఠాయించారు.

తాటాకిల్లు దగ్ధం

వీరవాసరం: వడ్డిగూడెంలో జరిగిన ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమయ్యింది. గ్రామంలోని నేపాల్ బ్రహ్మయ్యకు చెందిన తాటాకింటికి సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న వారు బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ మంటల్లో గ్యాస్ సిలిండర్ సైతం పేలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.